క్లుప్తంగా

నేటి వాహన సేవలు

ఉదయం సింహ వాహనం

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో మూడో రోజు బుధవారం ఉదయం శ్రీ మలయప్పస్వామివారు సింహ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమివ్వనున్నారు.

రాత్రి ముత్యపు పందిరి వాహనం

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో మూడో రోజు బుధవారం రాత్రి శ్రీ మలయప్పస్వామివారు ముత్యపుపందిరి వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమివ్వనున్నారు.

పరాశరేశ్వరునికి వెండి రథ హారతి



వెండి రథహారతిని అందిస్తున్న దాత సుధీర్ రెడ్డి

తిరుచానూరు(చంద్రగిరి) : యోగిమల్లవరంలో వెలసిన కామాక్షి సమేత శ్రీపరాశరేశ్వర స్వామివారికి వెండి రథ హారతిని విరాళంగా దాతలు సోమవారం అందజేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు సుధీర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలసి వెండి రథహారతిని ఆలయ కమిటీ చైర్మన్ శ్రీధర్ రెడ్డికు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ చిరంజీవి, అర్చకుడు వివేక్ స్వామి పాల్గొన్నారు.

వారపు సంతలో అన్నదానం

పాకాల : స్థానిక ఆర్టీసీ బస్‌స్టాండ్ సమీపంలో ని వారపు సంతలో రైతులు, వ్యాపారులకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మోహిత్‌రెడ్డి అన్న దానం చేపట్టారు. సోమవారం ఈ మేరకు స్థానిక వైఎస్సార్‌సీపీ నేతల చేతులమీదుగా భోజనం పంపిణీ చేశారు. నేతలు మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని వారపు సంతల్లో అన్నదానం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

ఉత్తమ విద్య.. ఉన్నత వసతులు

తిరుపతి సిటీ : టీటీడీ సంస్థల్లో పిల్లలకు ఉత్తమ విద్యతోపాటు ఉన్నత వసతులు కల్పిస్తున్నట్లు టీటీడీ డీఈఓ ఎం.భాస్కర్‌రెడ్డి తెలిపారు. సోమవారం తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో నూతనంగా ప్రారంభించిన హాస్టళ్ల వద్ద ఘనంగా వేడుకలు నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ రూ.37.80కోట్లతో రెండు హాస్టల్ భవనాలు నిర్మించామన్నారు. ప్రిన్సిపల్ నారాయణమ్మ మాట్లాడుతూ ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో చదువుకోవడం విద్యార్థుల అదృష్టమన్నారు. అనంతరం నూతన భవనాల వద్ద పూజలు నిర్వహించారు.

ఇంటి స్థలాల పంపిణీపై హర్షం

తిరుపతి కల్చరల్ : ఇంటి స్థలాలు పంపిణీ చేయడంపై టీటీడీ ఉద్యోగులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకర్లతో మాట్లాడారు. టీటీడీ పద్మావతి మహిళా ఉద్యోగుల సంఘం అధ్యక్షులు బి.హేమలత మాట్లాడుతూ చిరకాల కల సాకారం చేసిన టీటీడీ బోర్డు చైర్మన్ కరుణాకరరెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పి.లక్ష్మీదేవి, ప్రధాన కార్యదర్శి కె.అనురాధ, కార్యదర్శి రుక్మిణి పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ

చంద్రగిరి: ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడిన ఘటన మండలంలోని ఐతేపల్లి పంచాయతీ జగనన్న కాలనీలో సోమవారం చోటుచేసుకుంది. బాధితురాలి కథనం.. కాలనీకి చెందిన అభిరామి, గోపి దంపతులు తమిళనాడు కుంభకోణంలో అభిరామి అక్క కుమారుడు నిశ్చితార్థం కోసం కుటుంబ సభ్యులతో కలిసి శనివారం వెళ్లారు. తిరిగి సోమవారం ఇంటికి చేరుకోగా తాళాలు పగులగొట్టి.. బీరువా తెరిచి ఉంది. 16 గ్రాముల బంగారు, రూ.20వేల నగదు కనిపించలేదు.

కట్టుదిట్టంగా భద్రత

తిరుపతి రూరల్ : తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలకు కట్టుదిట్టంగా భద్రత కల్పించాలని చంద్రగిరి డీఎస్పీ యశ్వంత్ ఆదేశించారు.. మంగళవారం రాత్రి ఆలయం వద్ద ఏర్పాట్లను ఆయన పరిశీలించారు.

ఘనంగా స్పోర్ట్స్ డే

తిరుపతిసిటీ : శ్రీపద్మావతి మహిళా వర్సిటీలో మంగళవారం ఘనంగా స్పోర్ట్స్ డే నిర్వహించారు. వీసీ భారతి మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను అభ్యసించి సమాజానికి ఉపయోగపడాలని విద్యార్థులకు సూచించారు. వీపీఆర్ ఫౌండేషన్ చైర్మన్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పాజిటివ్ దృక్పథంతో ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం వర్సిటీలోని పద్మావతి అమ్మవారి ఆలయానికి రూ.5లక్షల విరాళం అందజేశారు.

తప్పులు లేకుండా ఓటరు జాబితా

తిరుపతి అర్బన్: ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులకు తావు ఉండకూడదని జేసీ డీకే బాలాజీ ఆదేశించారు. మంగళవారం 2024 ప్రత్యేక ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణపై ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో తిరుపతి కలెక్టరేట్ నుంచి ఆయన పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ ఆత్మహత్య

తిరుపతి రూరల్: పాతకాల్వకు చెందిన చిరంజీవి(32) ఆటోడ్రైవర్. భార్య ధన, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మద్యానికి బానిసైన అతను అధిక వడ్డీలకు అప్పులు చేశాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం భార్య తన పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురై ఇంట్లోనే ఉరి వేసుకున్నాడు.

తుమ్మలగుంటలో..

తుమ్మలగుంట ఉప్పరపల్లికి చెందిన జాన్సన్(23) మద్యానికి బానిసయ్యాడు. ఇంట్లో గొడవలు జరగడంతో మనస్తాపానికి గురై సోమవారం సాయంత్రం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

హంసవాహన సేవలో కళాకారుల ప్రదర్శన







బ్రహ్మాండం.. భువి వైకుంఠం

తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని టీటీడీ చేపట్టిన ఏర్పాట్లు కనువిందు చేస్తున్నాయి. వివిధ ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. స్నపన తిరుమంజనం అనంతరం మలయప్పస్వామికి అలంకరించిన విశేష మాలలు కనుల పండువగా ఉన్నాయి. వాహన సేవల్లో కళారూపాలు కట్టిపడేస్తున్నాయి. ఈ క్రమంలో టీటీడీ ఆవిష్కరించిన గ్రంథాలు ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లుతున్నాయి. బ్రహ్మాండంగా తీర్చిదిద్దిన తిరుగిరులు గోవిందనామ స్మరణతో మార్మోగుతున్నాయి.



పిస్తా మాల అలంకరణలో మలయప్పస్వామివారు



శ్రీవారి సేవకుల సదస్సులో మాట్లాడుతున్న టీటీడీ బోర్డు చైర్మన్ భూమన, ఈఓ ధర్మారెడ్డి తదితరులు

- వాహన సేవల్లో ఆకట్టుకుంటున్న కళాప్రదర్శనలు
- ఆకర్షణీయంగా ఫల, పుష్ప, ఫొటో గ్యాలరీలు
- శ్రీవారి అలంకరణలో ప్రత్యేకంగా వినూత్న మాలలు

తిరుమల: శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమలలోని కల్యాణవేదిక వద్ద ఏర్పాటుచేసిన ఫలపుష్ప, అటవీ, శిల్ప, ఆయుర్వేద, ఫొటో ప్రదర్శనశాలలను టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి, ఈఓ ఏవీ ధర్మారెడ్డి సోమవారం ప్రారంభించారు. ప్రజాసంబంధాల విభాగం ఆధ్వర్యంలో ఫొటో ఎగ్జిబిషన్, టీటీడీ పంచగవ్య ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయం, ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో ఫల పుష్ప ప్రదర్శన, ఎస్వీ ఆయుర్వేద ఆస్పత్రి ఆధ్వర్యంలో వనమూలికా ప్రదర్శన, శ్రీవేంకటేశ్వర శిల్పకళాశాల ఆధ్వర్యంలో శిల్పకళా ప్రదర్శన, ఎస్వీ వేద వర్సిటీ ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు.ఆయా విభాగాల అధికారులను చైర్మన్, ఈఓ అభినందించారు. కార్యక్రమంలో ఉద్యానవన విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, డిప్యూటీ సీఎఫ్ శ్రీనివాసులు, పీఆర్ఓ టి.రవి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రేణుదీక్షిత్ పాల్గొన్నారు.

శ్రీవారి సేవకులకు భగవదనుగ్రహం

తిరుమల శ్రీవారి దర్శనార్థం విచ్చేసే భక్తులకు ప్రేమతో సేవలు అందిస్తున్న శ్రీవారి సేవకులకు సులువుగా భగవంతుని అనుగ్రహం లభిస్తుందని టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. సోమవారం తిరుమల ఆస్థాన మండపంలో శ్రీవారి సేవలకు అవగాహన సదస్సు నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ భక్తులకు సేవలందించడం శ్రీవారి సేవకుల అదృష్టమన్నారు. 23 ఏళ్ల క్రితం ఈ సేవను ప్రారంభించామని, ఇప్పటివరకు దేశం నలుమూలల నుంచి 13 లక్షల మందికి పైగా పాల్గొన్నారని వెల్లడించారు. ఈఓ ఏవీ ధర్మారెడ్డి మాట్లాడుతూ శ్రీవారి క్షణకాల దర్శనం కోసం భక్తులు సుదూర ప్రాంతాల నుంచి వస్తుంటారన్నారు. వారికి సేవలందించే అవకాశం రావడం పూర్వజన్మ సుకృతమని తెలిపారు. కార్యక్రమంలో టీటీడీ పీఆర్ఓ టి.రవి, ఏపీఆర్ఓ కుమారి పి.నీలిమ పాల్గొన్నారు.

ఆకర్షణీయంగా మాలలు, కిరీటాలు

శ్రీవారి స్నపన తిరుమంజనంలో శ్రీమలయప్పస్వామివారికి అలంకరించిన చందనం, పిస్తా, యాలకులు మాలలు ఆకర్షణీయంగా దర్శనమిచ్చాయి. . మంగళవారం ఆలయంలోని రంగనాయకుల మండపంలో వేద మంత్రోచ్చారణ మధ్య స్నపన తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీ మలయప్పస్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేక వేదికపై ఆశీనులను చేసి వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. అర్ఘ్యపాద నివేదనలో భాగంగా పాలు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, గంధంతో స్నపనం నిర్వహించారు. అభిషేకానంతరం వివిధ పాశురాలను తిరుమల పెద్ద జీయ్యంగార్, తిరుమల చిన్న జీయ్యంగార్లు పఠించారు. ఈ వేడుకలో ఏలకులు, వట్టి వేరు, పిస్తా, చందనం, నల్ల ద్రాక్ష, పసుపు కొమ్ములు, రోజ్ పెటల్స్, తులసి మాలలను స్వామి అమ్మవార్లకు అలంకరించారు. గార్డెన్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణలు చేపట్టారు. అలాగే మలయప్ప స్వామివారికి వేసిన పూలమాలలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తిరుపూర్, సేలం దాతలు ఈ మాలలను విరాళంగా అందించారు. టీటీడీ ఈవో ధర్మారెడ్డి, జేఈఓ సదా భార్గవి, డిప్యూటీ ఈఓ లోకనాథం పాల్గొన్నారు.

మీడియా సెంటర్ ప్రారంభం

శ్రీవారి సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవ వైభవాన్ని ప్రపంచానికి చాటాలని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి కోరారు. సోమవారం ఉదయం తిరుమలలోని రాంభగీచా–2 విశ్రాంతి గృహంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను టీటీడీ ఈఓ ధర్మారెడ్డితో కలిసి ప్రారంభించారు. చైర్మన్ మాట్లాడుతూ మీడియా ప్రతినిధులకు భోజనంతో పాటు కంప్యూటర్లు, ఇంటర్నెట్, టెలిఫోన్‌వసతి కల్పించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో టీటీడీ పీఆర్ఓ టి.రవి, ఏపీఆర్ఓ కుమారి పి.నీలిమ, ఓఎస్‌డీ నాగేశ్వరరావు, సూపరింటెండెంట్ శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక పుస్తకాల ఆవిష్కరణ

చిన్న శేష వాహనసేవలో మంగళవారం ఆధ్యాత్మిక పుస్తకాలను టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి ఆవిష్కరించారు. శ్రీ వేంకటేశ్వస్వామివారు, శ్రీ వేంకటేశ్వర సచిత్ర సుప్రభాతం,, హిందూమత పురాణగళ్ నీతికదైగళ్ గ్రంథాలను విడుదల చేశారు.

కళా ప్రదర్శనలు భేష్

బ్రహ్మోత్సవాల్లో రెండవ రోజైన మంగళవారం ఉదయం చిన్నశేష వాహన సేవలో నిర్వహించిన కళా బృందాల ప్రదర్శనలు భక్తులకు ఆధ్యాత్మికానందం కలిగించాయి. వివిధ ప్రాంతాలకు చెందిన 9 బృందాలలో 217 మంది కళాకారులు ప్రదర్శనలిచ్చారు. డీపీపీ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ రాజగోపాల రావు, కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసులు, దాస సాహిత్య ప్రాజెక్ట్ ప్రత్యేకాధికారి ఆనంద తీర్థా చార్యులు ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు.



చిన్నశేష వాహన సేవలో కళా ప్రదర్శన



వకుళమాత అతిథిగృహం ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి



రచన అతిథి గృహం ప్రారంభిస్తూ..

కార్యక్రమంలో ఢిల్లీ స్థానిక సలహా మండలి అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం, సీవీఎస్వో నరసింహ కిషోర్, ఎస్ఈ–2 జగదీశ్వర్‌రెడ్డి, అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు విభీషణ శర్మ, ఉప సంపాదకుడు నరసింహాచార్య పాల్గొన్నారు.

పలకరింపు.. పులకరింపు



సీఎం వైఎస్ జగన్‌తో కార్పొరేటర్ల సెల్ఫీ





ఎస్‌కే బాబును పలకరిస్తూ.. విరూపాక్షి జయచంద్రారెడ్డి నుంచి పుష్పగుచ్ఛం అందుకుంటూ..

శోభాయమానం.. చవితి సంబరం

తిరుపతి కల్చరల్/తిరుపతి తుడా/తిరుపతి మంగళం : నగర వ్యాప్తంగా వినాయక చవితి సంబరాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశేషంగా అలంకరించిన మండపాల్లో వివిధ రూపాల్లో గణనాథుని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. డీఆర్ మహల్ సమీపంలోని దాసరి మఠం వద్ద ఏర్పాటు చేసిన బాల వినాయకుడి విగ్రహం ఆకట్టుకుంటోంది. యాదవకాలనీలో కరెన్సీ గణపతి కనువిందు చేస్తోంది. నిమ్మకాలయ వీధిలో కొలువైన బాల గణేశుడు, ఏడు అవతారాల్లో పూజలందుకుంటున్న విఘ్నేశ్వరుని విగ్రహాలు అబ్బురపరుస్తున్నాయి. దొడ్డాపురం వీధిలో తిరుమల శ్రీవారి రూపంలో వినాయకుడు దర్శనమిస్తూ ఆకట్టుకుంటున్నారు. కోటకొమ్మల వీధిలో డ్రైఫ్రూట్‌తో రూపొందించిన వినాయక విగ్రహం కట్టిపడేస్తోంది.

మంత్రి పెద్దిరెడ్డి పూజలు

తిరుపతి మారుతీనగర్‌లోని మంత్రి నివాసం వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, తంబళ్లపల్లి ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, టీటీడీబోర్డు మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్, పార్టీ నేత జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ కార్యాలయంలో..

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి మంత్రి ఆదిమూలపు సురేష్, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, నగర మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్ రెడ్డి, ముద్రనారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. డీసీ చంద్రమౌళీశ్వరరెడ్డి, ఎస్ఈ మోహన్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఎంఈలు చంద్రశేఖర్, వెంకటరామిరెడ్డి, రెవెన్యూ ఆఫీసర్లు సేతుమాదవ్, కేఎల్ వర్మ పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలవితరణ

ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు వీరాంజనేయులు ఆధ్వర్యంలో సోమవారం చిల్లీస్ రెస్టారెంట్ వద్ద ప్రజలకు ఉచితంగా వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌వీ స్వామి చేతుల మీదుగా 300 మట్టి ప్రతిమలను అందజేశారు.

భక్తులకు అన్నదానం

తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని లక్ష్మీ శ్రీనివాస ఆటో యూనియన్ వారు మంగళవారం టౌన్‌బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి చేతులమీదుగా అన్నదానం చేపట్టారు.

జర్నలిస్ట్ కాలనీలో..

వినాయక చవితి వేడుకల్లో భాగంగా మంగళవారం స్థానిక ఎర్రమిట్టలోని జర్నలిస్ట్ కాలనీలో భక్తులకు అన్నదానం చేశారు మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, ప్రెస్ క్లబ్ సెక్రటరీ బాలచంద్ర చేతుల మీదుగా అన్నప్రసాదాలను పంచిపెట్టారు. కాలనీలోని కృష్ణవేణి దంపతులు పూజలు నిర్వహించారు.

నిమజ్జనానికి సర్వం సిద్ధం

వినాయక నిమజ్జనానికి సర్వం సిద్ధం చేసినట్లు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత తెలిపారు. మంగళవారం సాయంత్రం వినాయక సాగర్ వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ బుధవారం వినాయక ప్రతిమల నిమజ్జన కార్యక్రమం ఉంటుందన్నారు.

భాకరాపేట : మండలంలో ఇంటింటా వినాయకచవితి వేడుకలు నిర్వహించారు.


పాకాల : శ్రీనివాస నగర్‌లో భారీ విగ్రహం ఏర్పాటు చేసిప్రత్యేక పూజలు చేశారు. ఎంపీటీసీ సభ్యులు కస్తూరి, మోహన్, డాక్టర్ శివప్రసాద్, వెంకటేష్ పాల్గొన్నారు.

చంద్రగిరి : మండలంలోని రామిరెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహ మండపాన్ని కూరగాయలతో విశేషంగా అలంకరించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొటాల చంద్రశేఖర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి గణేశ ఉత్సవాల్లో పాల్గొన్నారు.







గణపతి పూజలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కార్పొరేషన్ కార్యాలయం వద్ద మంత్రి సురేష్, టీటీడీ చైర్మన్ భూమన



జర్నలిస్ట్ కాలనీ వద్ద అన్నదానం చేస్తున్న డాక్టర్ అన్వేష్



మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్న వీరాంజనేయులు తదితరులు



జ్యోతి థియేటర్ సర్కిల్‌లో అన్నదానం చేస్తున్న డాక్టర్ జ్యోతికుమార్



బొమ్మగుంటలో అన్నప్రసాదం అందిస్తున్న యువత